ఇన్ సర్వీస్ కోటాను కొనసాగించాలి

ప్రజాశక్తి - పలాస

పాత పద్ధతిలోనే ఇన్ సర్వీస్ కోటాను కొనసాగించాలని పలాస డివిజన్ వైద్యాధికారులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే గౌతు శిరీషను ఆమె కార్యాలయంలో సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో నాలుగైదేళ్లుగా సేవలందిస్తున్నామని తెలిపారు. పిజి పరీక్షల్లో తాము విధుల్లో చేరినప్పుడు నిబంధనలు మార్చడం ద్వారా అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ... సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో వైద్యులు సునీల్‌కుమార్, సంపత్‌రావు, విజయ్‌కుమార్‌రెడ్డి, దేవి, సాయి, శివ, పృథ్వీ ఉన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

అన్నదాతకి అండగా నిలబడదాం

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాలో ఎక్కువ శాతం మంది వ్యవసాయ రంగంపై ఆధారపడి ఉన్నారని, వారి అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వ్యవసాయం, అనుబంధ శాఖలపై సంబంధిత అధికారులతో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. పలు శాఖల లక్ష్యం, సాధించిన ప్రగతి, సిబ్బంది నమూనా, పనితీరు తదితర అంశాల గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు అందించే ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ అభివృద్ధికి సంబంధించి తీసుకుంటున్న చర్యలపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. అన్నివిధాలుగా అన్నదాతకు అండగా నిలబడాలని, క్షేత్రస్థాయిలో అధికారులు అందుబాటులో ఉండాలని సూచించారు. జిల్లాలో 1,82,325 హెక్టార్లలో పలు పంటలు సాగు చేసే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. ఇందులో వరి 1,51,500 హెక్టార్లు, మొక్కజొన్న 10,000 హెక్టార్లు ప్రధానంగా సాగు చేయడమవుతుందని చెప్పారు. అవసరమైన విత్తనాలు, ఎరువులు పంపిణీ చేసినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.శ్రీధర్ తెలిపారు. పిఎం కిసాన్ కింద జిల్లాలో 2.29 లక్షల మంది రైతులకు రూ.45.8 కోట్లు వారి ఖాతాల్లో జమ చేశామని చెప్పారు. పశుసంవర్ధకశాఖ జెడి జయరాజ్, మత్స్యశాఖ డీడీ శ్రీనివాసరావు, మార్క్‌ఫెడ్ డిఎం రమణి, సెరికల్చర్ అధికారి రాజేంద్ర ప్రసాద్‌బాబు, ఉద్యానశాఖ అధికారి ఆర్.వి.వి.ప్రసాద్, మార్కెటింగ్ ఎడి గంగాధర్, ఎల్‌డిఎం సూర్యకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్లకు దోచిపెట్టే బడ్జెట్

- రైతులు, కార్మికులకు ఒనగూరేది శూన్యం
- సంయుక్త కిసాన్ మోర్చా నిరసన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పేద, మధ్యతరగతి ప్రజలపై భారాలు వేసి కార్పొరేట్లకు దోచిపెట్టేలా కేంద్ర బడ్జెట్ ఉందని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ తాండ్ర ప్రకాష్, ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌కు నిరసనగా సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యాన నగరంలోని అంబేద్కర్ జంక్షన్ వద్ద సోమవారం నిరసన తెలిపారు. బడ్జెట్ ప్రతులను దహనం చేయడానికి నాయకులు సిద్ధం కాగా, పోలీసులు అడ్డుకున్నారు. పోలీసుల తీరును నాయకులు ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ రైతాంగ, కార్మిక వ్యతిరేక బడ్జెట్ అని విమర్శించారు. వ్యవసాయానికి, గ్రామీణ ప్రాంతాలకు మోడీ ప్రభుత్వం మరోమారు అన్యాయం చేసిందన్నారు. రైతాంగ, కార్మిక, పేదల, గ్రామీణ వ్యతిరేక సంస్కరణలను ముందుకు తీసుకెళ్లేదిగా ఉందన్నారు. కార్పొరేట్ల ప్రయోజనాలను కాపాడేందుకు వ్యవసాయ రంగాన్ని కేంద్రం తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. గత బడ్జెట్ కన్నా ఈ బడ్జెట్‌లో ఎరువుల సబ్సిడీలో 35 శాతం, ఆహార సబ్సిడీలో 25 శాతం, ఉపాధి హామీ చట్టం నిధుల్లో 20 శాతం కోత పెట్టిందన్నారు. వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా చేసే ఏ ఒక్క చర్యా తీసుకోలేదని చెప్పారు. కార్మిక వర్గాన్ని అసలేమీ పట్టించుకోలేదని, పూర్తిగా పెట్టుబడిదారులకు అనుకూలంగా బడ్జెట్ ప్రవేశపెట్టిందని తెలిపారు. కేంద్ర బడ్జెట్ ఉత్త మాటల గారడీగా ఉందని, కీలకమైన రంగాలకు తగిన కేటాయింపులు లేవన్నారు. ధరల పెరుగుదలకు కారణమై, సామాన్యుల దైనందిన జీవితాన్ని అతలాకుతలం చేస్తున్న ద్రవ్యోల్బణాన్ని అరికట్టడానికి ఏ చర్యలూ ప్రకటించలేదని చెప్పారు. విద్య, వైద్య రంగాలకు తగిన కేటాయింపులు లేవన్నారు. గతంలో మోడీ ఇచ్చిన ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల హామీ ఏమైందని ప్రశ్నించారు. ఇది కార్పొరేట్లు, అంతర్జాతీయ ఫైనాన్స్ పెట్టుబడిదారులను సంతృప్తిపరచడం తప్ప దేశ ప్రజలకు దోహదపడేది కాదన్నారు. ఆర్థిక సంఘం ద్వారా రాష్ట్రాలకు నిధుల కేటాయింపు బిజెపి హయాంలో అంతకంతకూ కుదించుకుపోతోందన్నారు. 2022 బడ్జెట్‌తో పోలిస్తే ఈసారి ఏకంగా రూ.40 వేల కోట్లకు ఎగనామం పెట్టేశారన్నారు. రాష్ట్రానికి ఈసారీ కేటాయింపుల్లో తీరని ద్రోహం జరిగిందన్నారు. గొప్ప సాయం అందిస్తున్నట్లు ప్రసంగంలో ప్రవచించినా, తగిన నిధులు కేటాయింపు చేయలేదని తెలిపారు. విభజన చట్టంలోని ఏ ఒక్క హామీని నెరవేర్చడానికి నిర్దిష్టమైన కేటాయింపులు చేయలేదని చెప్పారు. రాజధాని నిర్మాణానికి రూ.15 వేల కోట్లను అంతర్జాతీయ ద్రవ్య సంస్థల ద్వారా రుణం తీసుకోవడానికి సాయపడతామని చెప్పారే గానీ గ్రాంటుగా ఇవ్వడం లేదన్నారు. ఈ అప్పును ఎవరు చెల్లిస్తారో, వడ్డీని ఎవరు భరిస్తారో స్పష్టత లేదన్నారు. విశాఖ రైల్వేజోన్ ఊసే లేదని, విశాఖ ఉక్కు పరిరక్షణకు బడ్జెట్‌లో భరోసా ఏమీ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్ ప్రవేశ పెట్టడానికి ముందే సిఐటియు, ఇతర కార్మిక సంఘాలు ఆర్థికశాఖ మంత్రిని కలిసి చేసిన సూచనలను ఏమాత్రం పట్టించుకోలేదని విమర్శించారు. కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెలమల రమణ, పి.ప్రసాదరావు, సిఐటియు నాయకులు కె.సూరయ్య, ఆర్.ప్రకాష్, పి.గోపి, రైతు కూలీ సంఘం నాయకులు ఎస్.కృష్ణవేణి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు పి.చందు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : నిరసన తెలుపుతున్న సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు

వజ్రపుకొత్తూరు : బడ్జెట్ పత్రాలను దహనం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ఎచ్చెర్ల : బడ్జెట్ పత్రాలను దహనం చేస్తున్న నాయకులు

ఎచ్చెర్ల : కేంద్ర బడ్జెట్‌కు నిరసనగా మండలంలోని చిలకపాలెం జంక్షన్‌లో సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యాన సోమవారం నిరసన తెలిపారు. అనంతరం బడ్జెట్ ప్రతులను దగ్ధం చేశారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు వెలమల రమణ, సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, టి.నందోడు, పి.కైలాస్ తదితరులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : కేంద్ర బడ్జెట్‌కు నిరసనగా మండలంలోని నగరంపల్లిలో రైతు, ప్రజాసంఘాల ఆధ్వర్యాన నిరసన తెలిపి బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా నాయకులు టి.భాస్కరరావు, కౌలు రైతుల సంఘం నాయకులు ఎన్.చంద్రయ్య, సిఐటియు నాయకులు మోహనరావు, బి.ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఆగస్టు 9, 10 తేదీల్లో విజయనగరంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొనడానికి జిల్లాస్థాయి క్రీడాకారుల ఎంపిక కార్యక్రమాన్ని నగరంలోని టౌన్ హాల్‌లో నిర్వహించారు. ఎంపిక పోటీలను తైక్వాండో అసోసియేషన్ ఉపాధ్యక్షులు శ్రీను సోమవారం ప్రారంభించారు. జూనియర్ బాలికల విభాగంలో అండర్ 42 కిలోల విభాగంలో బండి శిరీష, ఎబౌవ్ 68 కిలోల విభాగంలో శిమ్మ నవ్య, అండర్ 68 కిలోల విభాగంలో గొల్లంగి దుర్గాభవాని ఎంపికయ్యారు. జూనియర్ బాలుర విభాగంలో అండర్ 45 కిలోల విభాగంలో దనాల అక్షయ్ కుమార్, అండర్ 59 కిలోల విభాగంలో రవ్వ వెంకట ప్రీతమ్ ఎంపికయ్యారు. జిల్లాస్థాయి పోటీలకు న్యాయ నిర్ణేతలుగా గౌతమ్, సాయిబాలాజీ, గణసాయి వ్యవహరించారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్ డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలపై మొదటి విడత కార్యాచరణలో భాగంగా ఎచ్చెర్ల మండల విద్యాశాఖ అధికారులు కె.పున్నయ్య, రాజ్ కిషోర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిఒ నంబరు 117ను రద్దు చేసి, 53 జిఒ ప్రకారం టీచర్లను కేటాయించాలన్నారు. ప్రీ ప్రైమరీతో పాటు ఒకటి నుంచి ఐదు తరగతులను ఒకే పాఠశాలగా నడపాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకే సిలబస్, ఒకే పరీక్షా విధానం అమలు చేయాలని, హైస్కూల్‌లో రెండు మీడియంలను సమాంతరంగా కొనసాగించాలని కోరారు. ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయించాలని, హైస్కూల్‌లో నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించాలన్నారు. కిలోమీటరు పైబడి దూరం నుంచి వచ్చే విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించాలని, స్థానిక ప్రాంతాల పరిస్థితులను బట్టి మధ్యాహ్న భోజన పథకం మెనూను సవరించాలని కోరారు.

వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

మున్సిపల్ ఉపాధ్యాయులు, గిరిజన ప్రాంతాల్లో పనిచేసే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గిరిజన సంక్షేమ పాఠశాలలో పనిచేసే సిఆర్‌టిలను, భాషా వాలంటీర్లను రెగ్యులర్ ప్రాతిపదికన నియమించాలన్నారు. కోవిడ్ సమయంలో మృతి చెందిన మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల వారసులకు కారుణ్య నియామకాలు కల్పించాలని, మోడల్ స్కూల్ టీచర్ల సర్వీస్ రూల్స్ వెంటనే విడుదల చేయాలన్నారు. పిజిటిలకు జూనియర్ లెక్చరర్ హోదా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఎయిడెడ్ నుంచి స్థానిక సంస్థలు, ప్రభుత్వ పాఠశాలల్లో అబ్సార్బ్ అయిన ఉపాధ్యాయులకు పిఎఫ్ సౌకర్యం కల్పించాలని, ఎయిడెడ్ పాఠశాలల ఖాళీలను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మినిమం టైమ్స్ ఉపాధ్యాయుల సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలని, పాఠశాలలకు రావలసిన అన్ని గ్రాంట్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జి.సురేష్, మండల ప్రధాన కార్యదర్శి డి.రాము, నాయకులు జి.వి విశ్వనాథం, ఎస్.శ్రీనివాసరావు, సిహెచ్.రామారావు, ఎస్.స్వర్ణలత, ఎంటిఎస్ ఉపాధ్యాయుల సంఘం నాయకులు నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఒకటో తేదీనే శతశాతం పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లు ఆగస్టు ఒకటో తేదీనే లబ్ధిదారులకు శతశాతం పంపిణీ చేసేలా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో పింఛన్ల పంపిణీపై సంబంధిత శాఖల అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకటో తేదీన ఉదయం 5.30 గంటలకు పింఛన్ల పంపిణీ ప్రారంభించి, మొదటి రోజునే మొత్తం అందజేయాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు ముందుగానే క్షేత్రస్థాయి సిబ్బందిని సిద్ధం చేయాలన్నారు. ముందురోజున బ్యాంకుల నుంచి నిధులు తీసుకుని గ్రామాల వారీగా సచివాలయాల్లో పనిచేస్తున్న అన్ని శాఖల ఉద్యోగులు లబ్ధిదారులకు అందజేయాలన్నారు. జూలైలో ఎదురైన సమస్యలను దృష్టిలో ఉంచుకుని మళ్లీ అటువంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా లోపాలు ఉన్నట్టయితే తక్షణమే ఉన్నతాధికారులకు తెలియజేయాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి వెంకటేశ్వరరావు, లీడ్ బ్యాంకు మేనేజర్ సూర్యకిరణ్, గ్రామ, వార్డు సచివాలయ నోడల్ అధికారి వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

త్వరలో బస్టాండ్లలో బేబీ ఫీడింగ్ రూమ్‌లు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పాలిచ్చే తల్లులకు ప్రత్యేక గది అవసరమని, త్వరలో బస్టాండ్లలో వీటిని ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. జిల్లాపరిషత్‌లో 'మీకోసం'లో వినతులు ఇచ్చేందుకు వచ్చే పాలిచ్చే తల్లులకు, జెడ్‌పిలో పనిచేసే మహిళా ఉద్యోగులకు ఉపయోగపడేలా జెడ్‌పి సమావేశ మందిరంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గదిని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భేటీ బచావో, భేటీ పడావో కార్యక్రమం కింద ఈ గదులను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మహిళా శిశు సంక్షేమ, పంచాయతీరాజ్‌శాఖలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. శ్రీకాకుళం, టెక్కలి, పలాస, నరసన్నపేట ఆర్‌టిసి బస్టాండ్లలో బేబీ ఫీడింగ్ రూమ్‌లు త్వరలో ప్రారంభిస్తామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో ఇబ్బందుల దృష్ట్యా ఈ గదులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, ఐసిడిఎస్ పీడీ శాంతిశ్రీ, డిఎంహెచ్‌ఒ బి.మీనాక్షి, డిసిహెచ్‌ఎస్ రాజ్యలక్ష్మి, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి గడెమ్మ, బిసి సంక్షేమశాఖ అధికారి అనురాధ, వికలాంగుల శాఖ అధికారి కవిత తదితరులు పాల్గొన్నారు.

'అణు' వ్యతిరేక ఉద్యమకారులపై కేసు కొట్టివేత

ప్రజాశక్తి - శ్రీకాకుళం లీగల్

కొవ్వాడ అణువిద్యుత్కేంద్రాన్ని రద్దు చేయాలని, పర్యావరణాన్ని పరిరక్షించాలని పోరాటాలు చేసిన ఉద్యమకారులపై పోలీసులు పెట్టిన కేసును ఎక్సైజ్ మెజిస్ట్రేట్ సోమవారం కొట్టివేసింది. చెన్నై నుంచి పర్యావరణ పరిరక్షణ సభ్యులను తెచ్చి గ్రామాల్లో ప్రజలను రెచ్చగొట్టారని, భూ సర్వేలకు ఆటంకం కలిగించారన్న అభియోగంపై 2016లో సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సంజీవని పర్యావరణ పరిరక్షణ సమితి అధ్యక్షులు కూన రామం, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఈ కేసుకు సంబంధించి తగిన సాక్ష్యాధారాలను పోలీసులు నిరూపించలేకపోవడంతో ఎక్సైజ్ మెజిస్ట్రేట్ కేసును కొట్టివేసినట్లు ఉద్యమకారుల న్యాయవాది దుంపల రమణారావు తెలిపారు.

నేర నియంత్రణకు చర్యలు

ఎస్‌పి కె.వి మహేశ్వర్ రెడ్డి

ప్రజాశక్తి - గార

నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని ఎస్‌పి కె.వి మహేశ్వర్ రెడ్డి ఆదేశించారు. గార పోలీస్ స్టేషన్‌ను సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలు, రిసెప్షన్ కేంద్రం, రికార్డుల నిర్వహణ, ప్రాపర్టీ భద్రపరిచే గదులను పరిశీలించారు. ముఖ్యమైన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. సిబ్బందికి కేటాయించిన విధులు, పనితీరును ఆరా తీశారు. పెండింగ్ కేసులపై నిర్లక్ష్యం చేయకుండా సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. రాత్రివేళలో ముమ్మరంగా పెట్రోలింగ్ చేయడంతో పాటు గస్తీలు తిరిగి నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం విజిబుల్ పోలీసింగ్ నిర్వహించి అక్రమ రవాణాను అరికట్టాలన్నారు. అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. స్టేషన్ సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రతిఒక్కరూ బాధ్యతగా విధులు నిర్వర్తించాలని సూచించారు.

రికార్డులను పరిశీలిస్తున్న ఎస్‌పి మహేశ్వర్ రెడ్డి

ప్రజలకు చేరువలో ఆర్‌టిసి సేవలు

ఎమ్మెల్యే కూన రవికుమార్

ప్రజాశక్తి - ఆమదాలవలస

ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా నూతన బస్సులను ప్రారంభించిందని ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. పట్టణంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద శ్రీకాకుళం - బత్తిలి ఆర్‌టిసి బస్సును సోమవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌టిసి బస్సుతోనే సురక్షిత ప్రయాణం సాధ్యమన్నారు. ఆర్‌టిసి ప్రజల సంస్థ అని, దీన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ఆక్యుపెన్సీ రేటును పెంచి సంస్థను లాభాల్లోకి తీసుకురావాలన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో ఆర్‌టిసిని దివాలా తీయించి అప్పుల్లోకి నెట్టిందని మండిపడ్డారు. టిడిపి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై సిఎం చంద్రబాబు నాయుడు అధికారులతో సమీక్షించి నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. ఆర్‌టిసి కాంప్లెక్స్ ప్రాంగణంలోని గుంతలమయమైన రహదారికి ఆర్‌టిసి ఉన్నతాధికారులతో మాట్లాడి నిధులు మంజూరు చేసి, అభివృద్ధి పనులు చేపడతామన్నారు. పట్టణ శివారులో ఉన్న ఫ్లైఓవర్ దిగువన ఉన్న వైఎస్‌ఆర్ విగ్రహం వల్ల తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని కొంతమంది విలేకరులు రవికుమార్ దృష్టికి తీసుకెళ్లగా, అనుమతుల్లేకుండా నెలకొల్పిన విగ్రహాన్ని త్వరలోనే తొలగించి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆర్‌టిసి డిపో మేనేజర్లు శర్మ, మల్లికార్జునరాజు, ఆర్‌టిసి మేనేజర్ గంగరాజు, టిడిపి పట్టణాధ్యక్షులు ఎస్.మురళి, కూన భానోజీరావు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

జెండా ఊపి ఆర్‌టిసి బస్సును ప్రారంభిస్తున్న రవికుమార్

త్వరితగతిన అన్నా క్యాంటీన్ పనులు పూర్తి

అన్నా క్యాంటీన్ పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని మున్సిపల్ ఎఇ అప్పలనాయుడును ఎమ్మెల్యే రవికుమార్ ఆదేశించారు. పట్టణంలోని రైతు బజారు పక్కన చేపడుతున్న అన్నా క్యాంటీన్ భవన పనుల పురోగతిని పరిశీలించారు. టిడిపి ప్రభుత్వం పేద ప్రజల ఆకలిని తీర్చడానికి అన్నా క్యాంటీన్‌ను ప్రవేశపెడితే, వైసిపి ప్రభుత్వం వాటిని మూసివేసి పేదల పొట్ట కొట్టిందని మండిపడ్డారు. ఆగస్టు 15 నాటికి భవన ప్రారంభోత్సవానికి నూతన హంగులతో సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

విలీన పంచాయతీల్లో చట్టవిరుద్ధంగా ఆస్తిపన్ను పెంపు

'మీకోసం'కు 213 వినతులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగర పాలక సంస్థ పరిధిలోని విలీన పంచాయతీల్లో చట్ట విరుద్ధంగా ఆస్తి పన్ను పెంపుదల చేయడం తగదని, తక్షణమే పెంచిన ఆస్తి పన్నును ఉపసంహరించుకోవాలని జిల్లా ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు తమ్మన భాస్కర్, మణికొండ ఆదినారాయణమూర్తి కోరారు. నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన 'మీకోసం'లో వినతిపత్రం అందజేశారు. అద్దె విలువ ఆధారితకు బదులుగా ఆస్తి విలువ ఆధారిత ఆస్తి పన్నుగా మార్చి, 2020 ఏప్రిల్ 1 నుంచి అమలు చేస్తున్నారని అన్నారు. దీనివల్ల ఏటా ఆస్తి పన్ను పెరుగుతుందన్నారు. గత నాలుగేళ్లలో కాంపౌండింగ్ పద్ధతిలో 75 శాతం ఆస్తి పన్ను పెంచారని వివరించారు. దీనివల్ల విలీన పంచాయతీలైన చాపురం, పెద్దపాడు, పాత్రునివలస, కాజీపేట, కిల్లిపాలెం, తోటపాలెం, కుశాలపురం పంచాయతీ పరిధిలో భారీగా ఆస్తి పన్ను పెరిగిందన్నారు. జిఒ నంబరు 198 అనుసరించి ఏటా 15 శాతం పన్ను పెంపుదల ఉంటుందని, అందుకు భిన్నంగా నాలుగు రెట్లు ఆస్తి పన్ను పెంచారని వివరించారు. తక్షణమే ఈ పన్నుపై రివిజన్ చేపట్టాలని కోరారు. నగర పరిధిలోని వార్డు సచివాలయాల్లో ఆరోగ్య కార్యకర్తలపై పనిఒత్తిడి తగ్గించాలని ఎఎన్‌ఎంలు కోరారు. వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న కొందరు ఎఎన్‌ఎంలు జిఎన్‌ఎం శిక్షణ కోసం రెండున్నరేళ్ల క్రితం వెళ్లారని, ఆ సమయంలో అదనపు బాధ్యతలు అప్పగించిన అధికారులు ఇప్పుడు పెరిగిన పని భారాన్ని, లక్ష్యాలను పూర్తి చేయాలని ఒత్తిడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సింగుపురంలో తన భూమిని ఆక్రమించుకుని తనపై దాడి చేశారంటూ బాధితుడు దనాల జగదీశ్వరరావు ఫిర్యాదు చేశాడు. గార మండలం కళింగపట్నంలోని బ్యాంకు శాఖను మత్స్యలేశానికి తరలించే ప్రతిపాదన విరమించుకోవాలని గ్రామస్తులు విన్నవించారు. ఆర్‌బిఐ నిబంధనలను అనుసరించి వ్యాపార లావాదేవీలు ఆధారంగా ఈ మార్పు అనివార్యమని లీడ్ బ్యాంకు మేనేజర్ కలెక్టర్ వివరించారు. రణస్థలం మండలం లావేటిపాలెంలో డ్వాక్రా సంఘాల సభ్యుల మూలధనం రూ.22 లక్షలు కొందరు తమ సొంతానికి వాడుకున్నారని, దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని మహిళలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

వినతుల స్వీకరణ అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ స్వీకరించిన ప్రతి వినతినీ పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అంకితభావంతో పనిచేసి జిల్లాను ఉన్నత స్థానంలో నిలపాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలపై దృష్టిసారించాలన్నారు. 'మీకోసం'కు జిల్లావ్యాప్తంగా పలు సమస్యలపై 213 వినతులు వచ్చాయి. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, డిఆర్‌డిఎ పీడీ కిరణ్‌కుమార్, జెడ్‌పి సిఇఒ వెంకటేశ్వరరావు వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో కెఆర్‌సి ప్రత్యేక ఉప కలెక్టర్ సుదర్శనదొర, ఐసిడిఎస్ పీడీ శాంతిశ్రీ, డిఎంహెచ్‌ఒ డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ రాజ్యలక్ష్మి, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి గడెమ్మ, వెనుకబడిన తరగతులు సంక్షేమ అధికారి అనురాధ, వికలాంగులశాఖ ఎడి కవిత, డ్వామా పీడీ చిట్టిరాజు, జిల్లా ఉద్యాన అధికారి ఆర్.వి.ప్రసాదరావు, ఎల్‌డిఎం సూర్యకిరణ్, డిఇఒ వెంకటేశ్వరరావు, సమగ్ర శిక్షా అభియాన్ ఎపిసి డాక్టర్ జయప్రకాష్ పాల్గొన్నారు.

వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

సాగునీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే శిరీష

సాగునీరు విడుదల

ప్రజాశక్తి- మందస

ఎన్నికల్లో ప్రతి చేనుకూ నీరు, ప్రతి చేతికీ పని అన్న సంకల్పంతో ప్రజల ముందుకెళ్లానని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మందసలోని కళింగదళ్ రిజర్వాయరు నుంచి సాగునీటిని సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 3,600 ఎకరాల గిరిజన రైతులకు నీరందుతుందని అన్నారు. వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు సహకారంతో నియోజకవర్గంలోని శివారు పంటలకు సాగునీరు అందిస్తానని స్పష్టం చేశారు. తండ్రి శివాజీ కృషితో నిర్మించిన ప్రతి ప్రాజెక్టునూ ఆధునికీకరణకు పాటుపడతానని హామీనిచ్చారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి విఠల్, డిఇ వెంకటరమణ, జెఇ మధు, రుక్మిణి బిస్వాల్, టిడిపి మండల అధ్యక్షులు భావన దుర్యోధన, తాతారావు, లింగరాజు కర్రయ్య, రుద్రయ్య, నవీన్, చంద్రశేఖర్, బలరాం బిస్వాల్, సురేంద్ర మస్టర్, బాలకృష్ణ, కేశవరావు, ఈశ్వరరావు, గణపతి, శ్రీరామ్, తిరుపతి పాల్గొన్నారు.

ఎస్‌పిని కలిసిన ఎమ్మెల్యే ఎంజిఆర్

ప్రజాశక్తి- పాతపట్నం

వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ఎంజిఆర్

ఇటీవల ఎస్‌పిగా బాధ్యతలు చేపట్టిన కె.వి.మహేష్‌రెడ్డిని ఎమ్మెల్యే మామిడి గోవిందరావును మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా ఎస్‌పి కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పాతపట్నం నియోజకవర్గంలో శాంతిభద్రతలు, అంతర్రాష్ట్ర చెక్ పోస్టు వద్ద నిఘాపై వివరించారు. ఒడిశా నుంచి వచ్చే గంజాయిని అరికట్టాలని అన్నారు. అలాగే లక్ష్మీనర్సుపేట మండలంలో పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు సహకరించాలని విన్నవించారు. మెళియాపుట్టి పోలీస్‌స్టేషన్‌కు జీపు మంజూరు చేయాలన్నారు. మిగా స్టేషన్లలో కాలం చెల్లిన వాహనాల స్థానంలో కొత్త వాటిని సమకూర్చాలన్నారు.

ఆర్‌టిసి అప్రెంటిస్‌కు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎపిఎస్ ఆర్‌టిసి విజయనగరం రీజియన్ పరిధిలో ఉన్న అప్రంటీస్ స్కూల్‌లో ఐటిఐ పూర్తిచేసిన అభ్యర్థులకు శిక్షణ ఇచ్చేందుకు ఈ ఏడాది ఆగస్టులో దరఖాస్తులు స్వీకరించేందుకు ప్రభుత్వం అనుమతించిందని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ మేరకు ఆయన జిల్లా ప్రజా రవాణాధికారి కార్యాలయానికి లిఖిత పూర్వకమైన ఉత్తర్వులు జారీ చేశారు. ఈ శిక్షణలో వివిధ ట్రేడ్‌ల అభ్యర్థులు చేరేందుకు వీలు కల్పిస్తున్నట్టు తెలిపారు. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ నిర్వహించేందుకు వీలుగా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఆ లేఖలో పేర్కొన్నారని జిల్లా ప్రజారవాణాధికారి విజయకుమార్ తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

కొత్తూరు : మండలంలోని కర్లెమ్మ పంచాయతీ నేతాజీ నగర్ కాలనీకి చెందిన టిడిపి నాయకులు మడపాన రాజారావు తల్లి సావిత్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న టిడిపి జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ రాజారావును సోమవారం పరామర్శించారు. ఈయన వెంట సర్పంచ్ లోతుగెడ్డ భగవాన్‌దాస్ నాయుడు, ఎల్.శ్రీనివాసులు ఉన్నారు.

యథేచ్ఛగా మట్టి తవ్వకాలు

పట్టించుకోని రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి- పలాస

ట్రాక్టర్‌తో తరలిస్తున్న మట్టి

పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఇష్టానుసారంగా మట్టి తవ్వకాలు చేపడుతున్నారు. చెరువులు, వాగులు పంట పొలాల్లో అక్రమ మట్టి తవ్వకాలు చేపట్టి మట్టి మాఫియా కాసులు సంపాదించుకుంటున్నారు. మట్టిని అక్రమంగా తరలిస్తున్నా రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. చెరువులో మట్టే కదా? అని వదిలేయడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుంది. మరోవైపు మట్టి మాఫియా సొమ్ము చేసుకుంటున్నారు. కాశీబుగ్గ 5వ వార్డు తాళభద్ర శ్మశానం పక్కన ఉన్న చెరువులో అక్రమ మట్టి తవ్వకాలు చేపడుతున్నారు. నెల రోజుల నుంచి ఇక్కడ మట్టిని తవ్వి ఇటుక బట్టీలు, భవన నిర్మాణంలో పునాదుల్లో వేయడానికి తరలిస్తున్నారు. ట్రాక్టర్ మట్టి ధర రూ.700 వరకూ వసూళ్లు చేస్తూ... ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. సాక్ష్యాత్తు గ్రామ సచివాలయానికి కూత వేటు దూరంలో చెరువులో మట్టి తవ్వకాలు జరుగుతున్నా సంబంధిత సిబ్బంది వాటిని నిలువరించకుండా చోద్యం చూస్తుండడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో చెరువులు, కాలువలు, కొండలు ఏవీ విడిచిపెట్టకుండా ఎటువంటి అనుమతులు లేకుండానే అక్రమ తవ్వకాలు జరిపేవారు.

ప్రస్తుతం టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వీటి తవ్వకాలు ఆగిపోతాయని అంతా భావించారు. అందుకు విరుద్ధంగా అధికారుల సెలవు దినాలు, ఉద్యోగోన్నతుల్లో బిజీగా ఉన్న సమయాలు తెలుసుకొని యథేచ్ఛగా మట్టిని తరలిస్తూ... జోబులు నింపుకుంటున్నారు. కొద్ది రోజుల క్రితం స్థానిక పెంటిభద్ర రోడ్డులో ఉన్న కుంకుమసాగరం చెరువులో కూడా ఇదేవిధంగా తవ్వకాలు చేపడుతున్నారు. మట్టి, కంకర తవ్వకాలు చేపట్టే సమయంలో ముందస్తుగా రెవెన్యూ, మైన్స్ అధికారుల నుంచి అనుమతులు పొందాల్సి ఉంది. కానీ, మాఫియా పెద్దలకు అటువంటి అనుమతులు అవసరం లేదు. తమకు ఎవరు ఏమి చేస్తారులే అంటూ బహిరంగంగా ఇష్టానుసారంగా మట్టి తవ్వకాలు చేపడుతున్నారు. ఈ విషయంపై పలాస డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మీనారాయణకు వివరణ కోరగా, మట్టి తవ్వకాలు చేపడుతున్నట్లు మా దృష్టికి రాలేదన్నారు. తక్షణమే తమ సిబ్బందికి పంపించి మట్టి తవ్వకాలు నిలిపి వేస్తామన్నారు. అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్

ఎమ్మెల్యే అశోక్

పుస్తకాలను అందజేస్తున్న ఎమ్మెల్యే అశోక్

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

కష్టపడి ఇష్టంతో చదవి మంచి ఫలితాలు సాధించాలని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. స్థానిక బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అత్యున్నత శిక్షణ పొందిన అధ్యాపకులు బోధిస్తున్నారని అన్నారు. ప్రయివేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో సర్వసౌకర్యాలు ఉన్నాయని అన్నారు. ముందుగా ప్రిన్సిపాల్ వరద శంకరరావు అధ్యక్షత విద్యార్థినులతో ముఖాముఖి మాట్లాడారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు, బుద్దాల నిర్మలారెడ్డి, కాళ్ల ధర్మారావు, దక్కత ఢిల్లీరావు, తిప్పన దుర్యోధనరెడ్డి, కాళ్ల జయదేవ్, కాళ్ల దిలీప్‌కుమార్, నాగరాజు పాత్రో, పత్రి తవితయ్య, నందిక జాని, లీలారాణి, పద్మనాభం, జన్నెల సంతోష్, జిలానీ జానికిరావు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దశాబ్దాలుగా గెస్ట్ లెక్చరర్లు బాధ్యతలు నిర్వహిస్తున్నామని, తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. బాలిక జూనియర్ కళాశాలలో ఎమ్మెల్యే అశోక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏళ్ల తరబడి తక్కువ జీతానికి పనిచేస్తున్న తమకు భద్రత కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే స్పందిస్తూ... సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో గెస్ట్ లెక్చరర్లు డి.మమత, త్రినాథరావు, ఢిల్లేశ్వరి, శివప్రసాద్, జానకిరావు, కిరోదేవి పాల్గొన్నారు.

సొంత నిధులతో కాలువ శుభ్రం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ప్రొక్లెయినర్‌తో పూడికలను తొలగిస్తున్న రైతులు

తోటి రైతుల మేలు కోసం తనవంతు సహకారం అందించాడు సుంకర జగన్నాథపురానికి చెందిన రైతు గంగిట్ల రామారావు. పదేళ్లుగా పిల్లబట్టి పూడికతీయకపోవడంతో కాలువ అస్తవ్యస్తంగా తయారైంది. ఇటీవల వంశధార శివారు ప్రాంతాలకు సాగునీరు విడుదలైంది. అయినా తమ గ్రామ రైతులకు ఉపయోగపడడం లేదని రైతు రామారావు గుర్తించారు. గ్రామపక్క నుంచి 60 అర్‌ఎల్ కాలువ ద్వారా వంశధార నీటిని బోయిన చెరువుకు తరలించి రైతులకు చేదోడుగా నిలవాలని సంకల్పించాడు.

దీంతో సర్పంచ్ గాడి అఖిల్ సమక్షంలో తన సొంత నిధులతో సోమవారం ప్రొక్లెయినర్‌తో శుభ్రం చేపట్టి చెరువుకు నీరు చేరేకునే విధంగా చర్యలు చేపట్టారు. బోయిన చెరువు పూర్తిస్థాయిలో నిండితే సుమారు అరవై ఎకరాలు భూమికి సాగునీరు అందుతుందని సర్పంచ్ తెలిపారు. రైతు రామారావు కృషిని సర్పంచ్‌తో పాటు రైతులు అభినందించారు.

ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర్‌రెడ్డి

ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు

ఎస్‌పి కె.వి మహేశ్వర్‌రెడ్డి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ప్రజా ఫిర్యాదుల పరిష్కానికి తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్‌పి కె.వి.మహేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్‌పి మహేశ్వర రెడ్డి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి వారితో ముఖాముఖి మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకొని పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఫిర్యాదుదారుల అర్జీలు, వారి వివరాలు సంబంధిత పోలీసు అధికారులకు తక్షణమే తెలియపర్చి చట్ట ప్రకారం చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఈ క్రమంలో ఎస్‌పి స్వయంగా అర్జీదారుల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఆయా ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో జిల్లా పోలీస్ కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలని ఎస్‌పి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పలు సమస్యలకు సంబంధించి 58 ఫిర్యాదులు అందించారు.

ధనావతికి స్వర్ణ నంది అవార్డు

ఇచ్ఛాపురం : కళాకారిని పెదిన ధనావతికి స్వర్ణ నంది అవార్డుకు ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని త్యాగరాజు ఆడిటోరియంలో మెగా ఎంటర్‌ప్రైజెస్ మేనేజింగ్ డైరక్టర్ శిరీష రెడ్డి ఆదివారం రాత్రి అవార్డును అందజేశారు. ధనావతి కళాసేవలో తరిస్తూ, కళా రంగంలో రాణిస్తూ, కళా రంగంలో అత్యున్నత సేవలు అందించినందుకు ఆమెకు అవార్డును బహూకరించారు. ఆమెకు పలువురు అభినందనలు తెలియజేశారు.

మాట్లాడుతున్న సన్యాసినాయుడు

చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి- శ్రీకాకుళం లీగల్

ప్రతిఒక్కరికీ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి, కార్యదర్శి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆర్.సన్యాసినాయుడు అన్నారు. స్థానిక న్యాయ సేవా భవనంలో న్యాయ అవగాహనా సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వగతి, స్వాతి స్వచ్ఛంద మహిళా సంస్థలు ప్రజలకు దగ్గరిగా వారి స్థితిగతులను చూస్తున్నారని అన్నారు. అర్హత గల మహిళలు వారి సమస్యలను నేరుగా న్యాయ సేవాధికార సంస్థ వద్దకు వెళ్లి పరిష్కరించుకోవడానికి చక్కటి మార్గం వలే పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డిసిపిఒ కె.వి.రమణ, సిడబ్ల్యుసి చైర్‌పర్సన్ శ్రీలక్ష్మి, కె.రమణమూర్తి, స్వీప్ డైరెక్టర్, పోలీసులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

టెక్కలి రూరల్ : టెక్కలి ఆదివాసీ యునియన్ ఎజెఎసి ఆధ్వర్యాన వచ్చే నెల 9 ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని హరిపురం ఆనందరావు, వరహా కృష్ణారావు కోరారు. ఈ మేరకు సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఆదివాసీ హక్కుల సాధన దిశగా అంతరించిపోతున్న ఆదివాసీ రిజర్వేషన్ల అంశాల గురించి, భవిష్యత్ కార్యాచరణ దిశగా గిరిజన సంఘాల రాజకీయ పార్టీలకతీతంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జన్ని విశాఖరావు తదితరులు పాల్గొన్నారు.

అభినందిస్తున్న ప్రిన్సిపాల్ అర్చన

విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి- పాతపట్నం

ఈ నెల 28న జిల్లా కేంద్రంలోని సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యాన సాఫ్ట్ టెన్నిస్ జూనియర్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలో స్థానిక డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకులం విద్యార్థులు ఆర్.హారిక, ఎం.త్రివేణి, టి.యమున, పి.నాగమణి పాల్గొని రాష్ట్రస్థాయి సాఫ్ట్ టెన్నిస్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వి.అర్చన సోమవారం తెలిపారు. ఎంపికైన విద్యార్థులు వచ్చే నెల 4,5 తేదీల్లో విజయవాడ ఇంద్ర ప్రియదర్శిని స్టేడియంలో జరగనున్న రాష్ట్రస్థాయి సాఫ్ట్ టెన్నిస్‌లో పాల్గొంటారని అన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఆమెతో పాటు వైస్ ప్రిన్సిపాల్ వి.సంధ్యారాణి, పీడీ దుర్గమ్మ, పిఇటి ఎస్.త్రివేణి అభినందించారు.

రేపు నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- రణస్థలం

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ పిలుపుమేరకు సోమవారం మండల కేంద్రంలో ఎచ్చెర్ల నియోజకవర్గ కార్యవర్గానికి సంబంధించిన సోమవారం సమావేశం నిర్వహించారు. మండల కేంద్రం వైటి టివి కార్యాలయంలో యామల తవిటియ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎచ్చెర్ల నియోజకవర్గ పాత్రికేయులు పాల్గొన్నారు. ఈ నెల 31న నూతన కార్యవర్గం ఎన్నికపై సమావేశంలో చర్చించారు. 31న నియోజకవర్గ పరిధిలో ఉన్న విలేకరులు రణస్థలంలో జరుగు సమావేశానికి హాజరు కావాలని పిలుపునిచ్చారు.

లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండరాదు

మురుగునీటిని పరిశీలిస్తున్న కమిషనర్ ఓబులేసు

శ్రీకాకుళం అర్బన్ : నగర పాలక సంస్థ పరిధిలో విలీన పంచాయతీల్లో ఒకటైన తోటపాలెం పరిసరాలను సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు పరిశీలించారు. ప్రధానంగా పిఎన్‌కాలనీ సెంటరు నుంచి విజయ నర్సింగ్ కాలేజీ వరకు రోడ్డుపై నీరునిల్వ వలన వాహన దారులు పడుతున్న ఇబ్బందులను స్థానికులు ఆయనకు వివరించారు. దీంతో నీరునిల్వ లేకుండా స్థానికంగా ఉన్న లేఅవుట్ వరకు నీరు మళ్లించేందుకు చర్యలు చేపట్టారు. కాల్వల్లో పూడికలను తొలగించడంతో పాటు లోతట్టు ప్రాంతంలో ఇరువైపులా తాత్కాలికంగా డ్రైనేజిని తవ్వి వరనీటిని మళ్లించారు. శాశ్వతమైన పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటానని కమిషనర్ హామీఇచ్చారు. ఈ రోడ్డులో ఇసుక లారీలు పెద్దఎత్తున ప్రయాణించడం వలన తోటపాలెం మొదలు పిఎన్‌కాలనీ జంక్షన్ వరకు రోడ్డుపై గోతులు పడ్డాయని వివరించారు. అలాగే తోటపాలెంలో పారిశుధ్య నిర్వహణపై ఆయన పరిశీలించారు.

మట్టి అక్రమ తవ్వకాలు అడ్డగింత

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

పరిశీలిస్తున్న తహశీల్దార్ చక్రవర్తి తదితరులు

మండలం లోని చిలకపాలెం పంచాయతీ నారాయణపురం భూముల్లో అక్రమంగా మట్టి తవ్వకాలను సోమవారం అధికారులు అడ్డుకున్నారు. ఈ దాడిలో చిలకపాలెంకు చెందిన టిప్పర్లు, లారీలు, ట్రాక్టర్లు యజమానులు మండలంలో వివిధ గ్రామాలకు కొద్ది రోజులుగా తరలిస్తున్నారు. స్థానికుల సమాచారం మేరకు తహశీల్దార్ ఎం.చక్రవర్తి, మైనింగ్ ఇన్‌స్పెక్టర్ మాణిక్యాలరావు, ఎస్ఐ చిరంజీవి స్థలం వద్దకు చేరుకొని నిలుపుదల చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ జెసి ఆదేశాల వరకు దాడులు నిర్వహించామని అన్నారు. ఈ సమయంలో ఆరు లారీలు, ఒక ప్రొక్లెయినర్, రెండు ట్రాక్టర్లు ఉన్నాయని తెలిపారు. తవ్వకాల కోసం రెవెన్యూ, మైనింగ్‌శాఖల నుంచి ఎటువంటి అనుమతులు లేవని చెప్పారు. వాస్తవ పరిస్థితిపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తానని అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

'ఈ-వేమన' కవితకు పురస్కారం

ఈ-వేమనకు సన్మానిస్తున్న ప్రతినిధులు

ప్రజాశక్తి- రణస్థలం

ప్రముఖ కవి, రచయిత కవితామయం సంస్థ అధ్యక్షులు మహ్మద్ రఫీ (ఈ-వేమన)కు కాకినాడ జిల్లాలో పిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శ్రీశ్రీ కళావేదిక గోదావరి జాతీయ కవితోత్సవంలో ఆయన రాసిన పోరాటం కవిత విని అహుతులు సంతోషించారు. అనంతరం ఆ సంస్థ అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్, శ్రీశ్రీ కళావేదిక జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి శ్రీశ్రీ పురస్కారంతో సన్మానించారు.

శ్రీశ్రీ కళావేదిక ఉత్తరాంధ్ర అధ్యక్షుడుగా ఈవేమన

సాహిత్య, సాంస్కృతిక, కళా, సామాజిక సేవా కార్యక్రమాల ప్రోత్సాహం కోసం ఏర్పాటు చేసిన ఐఎస్‌ఒ గుర్తింపు పొందిన శ్రీశ్రీ కళావేదికకు శ్రీకాకుళం వేమన కవితామయం వ్యవస్థపాక అధ్యక్షుడు ఈవేమనను ఉత్తరాంధ్ర అధ్యక్షుడుగా కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, జాతీయ కన్వీనర్ రమావతి ఎంపిక చేశారు. తన ఎంపికపై తాను పనిచేస్తున్న ప్రభుత్వ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ పి.శ్రీధర్‌తో పాటు కవితామయం ప్రధాన కార్యదర్శి జంధ్యాల శరత్ బాబు, ఉదయ్ కిరణ్, సురంగి మోహనరావు, పలు సాహితీ సంస్థలు హర్షం వ్యక్తం చేసారు.

బినామీ ఉద్యోగిపై పోలీసుల విచారణ

ప్రజాశక్తి- పొందూరు

బాలికలు, విద్యార్థినులతో అనుచిత ప్రవర్తనపై ఎంతమందిపై పోక్సో కేసులు నమోదు చేస్తున్నా కొంతమంది ప్రవర్తనలో మార్పు రావడం లేదు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌కు బినామీ ఉద్యోగం చేస్తున్న వ్యక్తిపై సోమవారం పోలీసులు విచారణ చేపట్టారు. పాఠశాలలో వికలాంగుల కోటాలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించిన మహిళకు బదులు పాఠశాలలో బినామీ ఉద్యోగి విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే సదరు బినామి ఉద్యోగి పాఠశాలలో కొంతమంది విద్యార్థునులకు ఫోన్‌ద్వారా వాట్సాప్‌లో అసభ్య మెసేజ్‌లు పెడుతూ వస్తున్నారు. ఈ విషయం పాఠశాల ఉపాధ్యాయులకు తెలియడంతో బినామీ ఉద్యోగిని మందలించారు. ఇదే విషయం పాఠశాలకు వచ్చిన టిడిపి నాయకుల దృష్టికి కొంతమంది ఉపాధ్యాయులు, విద్యార్థినులు తీసుకు వెళ్లడంతో ప్రవర్తన మార్చుకోవాలని లేకపోతే తీవ్రపరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.

అయినప్పటికీ ప్రవర్తనలో మార్పు రాలేదు. ఈ సంఘటనపై పాఠశాల మహిళా ఉపాధ్యాయుల పేరుతో జిల్లా ఎస్‌పికి ఫిర్యాదు వెళ్ళింది. దీంతో విచారణ జరపాల్సిందిగా పొందూరు ఎస్‌ఐను ఆదేశించారు. ఎస్‌పి ఆదేశాలతో పాఠశాలలో విచారణ జరిపారు.

బినామీ ఉద్యోగికి హెచ్ఎం వత్తాసు

ఈ విషయమై పాఠశాల హెచ్ఎంకు సమాచారం ఉన్నా హెచ్ఎం పి.వెంకటరావు మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోలేదు. పాఠశాలలో జరిగిన నాడు-నేడు పనుల్లో అవినీతి జరిగిందన్న ఆరోపణలున్నా ఆ పనుల్లో హెచ్ఎంకు బినామీ ఉద్యోగి అండగా నిలవడంతో సదరు బినామీ ఉద్యోగికి హెచ్ఎం వత్తాసు పలుకుతున్నాడనే ఆరోపణలు వస్తున్నాయి. ఇదే పాఠశాలలో కొద్దినెలల క్రితం ఒక ఉపాధ్యాయుడు విద్యార్థినిలతో అనుచితంగా ప్రవర్తించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి గొడవ చేసారు. దీనిపై మిగిలిన ఉపాధ్యాయులు విద్యార్థినిల తల్లిదండ్రులకు నచ్చజెప్పి మరోసారి ఇటువంటి సంఘటన జరుగకుండా చూసుకుంటామని హామీఇవ్వడంతో వారు ఫిర్యాదు చేయకుండా వెళ్లిపోయారు. పాఠశాలలో ఇటువంటి సంఘటనలు జరుగుతుండడంతో ఉపాధ్యాయులు, విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

'గాయత్రి'లో రాష్ట్రస్థాయి వర్క్‌షాప్

శ్రీకాకుళం రూరల్ : కథ, కవిత, వ్యాస రచనలపై విద్యార్థులకు పోటీ పరీక్షల నేపథ్యంలో తగిన అవగాహన కలిగించేందుకు వర్క్‌షాప్‌లు అవసరమని గురజాడ విద్యాసంస్థల అధినేత జి.వి.స్వామినాయుడు అన్నారు. గాయత్రి కాలేజీ అఫ్ సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాల తెలుగు విభాగం ఆగష్టు 18న నిర్వహిస్తున్న వర్క్‌షాప్ పోస్టర్‌ను అయన ఆవిష్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు సివిల్స్, గ్రూప్స్ వంటి పోటీ పరీక్షల్లో వచ్చే డిస్క్రిప్టివ్ విభాగంలో తగిన నైపుణ్యాలను నేర్పటం కోసం ఈ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నామని తెలిపారు. వివిధ జిల్లాలకు చెందిన లెక్చరర్లు, పత్రికలకు చెందిన వారు విద్యార్థులకు దిశానిర్దేశం చేస్తారన్నారు. కార్యక్రమం లో వైస్ ప్రిన్సిపాల్ కె.వి.వి. సత్యనారాయణ, ఐక్యూఎసి సమన్వయకర్త డాక్టర్ మార్తాండ కృష్ణ, తెలుగు విభాగధిపతి భమిడిపాటి గౌరిశంకర్, అప్పలనాయుడు, గోపాలరావు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న స్వామినాయుడు

పోడు భూముల్లో పచ్చదనం

సవర జాడుపల్లి వద్ద పచ్చదనంతో కనిపిస్తున్న పోడు భూములు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

అంతరిస్తున్న అడవులకు పోడు భూములకు పచ్చదనానికి ఊతమిస్తుంది. గిరిజనులకు పోడు భూములకు జీవనాధారం కలగడంతో పాటు పచ్చదనంతో పర్యావరణానికి ఎంతో మేలు చేకూరుతుంది. జిల్లాలో మొదటి స్థానంలో ఉన్న మెళియాపుట్టి మండలంలో అధిక శాతం గిరిజనులు పోడు భూములపై ఆధారపడి జీవనాధారం సాగిస్తున్నారు. పోడు పంటలైన జొన్న, గంటెలు, కొర్రలతో పాటు ఇతర ఆదాయాన్నిచ్చే కొండచిపుల్లు, పసుపు, అల్లం, పైనాపిల్, అలాగే పళ్ల రకాలైన బొప్పాయి, జామ, బత్తాయి, జీడిమామిడి సాగు మొక్కలను పెంచుతున్నారు. దీనితో అడవుల్లో ఏడాది పొడవునా పోడు భూములు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. దీనితో గిరిజనుల ఆదాయ వనరులు చేకూరుతున్నాయి. జిల్లాలో కొత్తూరు, పాతపట్నం, మెళియాపుట్టి, టెక్కలి, మందస, పలాస, సోంపేట తదితర మండలాల్లో దాదాపు 20 వేల ఎకరాల్లో పోడు భూముల్లో సాగు అవుతున్నాయి. మెళియాపుట్టి మండలంలో కేరాశింగి, గూడ, భరణికోట, సవరజాడుపల్లి, సవరబాణాపురం, ఆంపురం, పింగువాడ, హడ్డివాడ, దబ్బ గుడ్డి, పెద్ద కేదారి, వెంకటాపురం, నేల బొంతు, గొట్టిపల్లి తదితర ప్రాంతాల్లో 3 వేల ఎకరాల వరకు పోడు భూములు సాగవుతున్నా యి. పోడు భూముల్లో ఆదాయాన్ని అందించే పంటలు సాగు చేస్తుండడంతో గిరిజనులు ఆర్థిక జీవన పరిస్థితులు మెరుగుపడుతున్నాయి. గిరిజనుల జీవన పరిస్థితుల్లో మరింత మెరుగుపడ టానికి చల్లని వాతావరణం ప్రాంతాలైన కేరాసింగి, గూడ, గొట్టిపల్లి, వీరన్నపేట, భరణికోట ప్రాంతాల్లో కాఫీ మొక్కలను పెంచేందుకు ప్రభుత్వం తగు చర్యలు చేపడితే బాగుంటుందని పలువురు గిరిజనులు కోరుతున్నారు.

పచ్చదనంతో నిండుతున్నాయి

బోసిపోయిన అడవులు ప్రస్తుతం పచ్చదనంతో నిండుతున్నాయి. జీడి, మామిడి తోటలు పెంచడంతో పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. అడవులు నరికి వేత కనుమరుగయ్యాయి.

ప్రోత్సాహం అందించాలి

సాగు చేస్తున్న భూముల్లో పంటల అభివృద్ధి పరిచేందుకు గిరిజన రైతులకు ప్రభుత్వపరంగా సహాయం అందించాలి. ఉచితంగా విత్తనాలు, ఎరువులు సరఫరా చేయాలి.

- సవర ఆదినాయుడు, వైస్ ఎంపిపి

అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ గోవిందమ్మ

నర్సరీపై అవగాహన

టెక్కలి : విద్యార్థులు చదువుతో పాటు స్వయం పోషక విధానంలో భాగంగా నర్సరీ వినియోగంపై ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ సోమవారం అవగాహన కల్పించారు. వృక్షశాస్త్ర విభాగం, ఉద్యానవన పంటలశాఖ ఆధ్వర్యాన విద్యార్థులు మొక్కలను సేకరించి వాటిని భద్రపరిచే క్రమంలో నర్సరీ తయారీ చేపట్టే విధానంపై వివరించారు. మొదటి విడతగా మొక్కలను నాటించారు. వ్యర్థంగా ఉన్న ప్లాస్టిక్ బాటిళ్లను సేకరించి వాటిని వినియోగించే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐక్యూ కో-ఆర్డినేటర్ లూక్‌పాల్, అధ్యాపకులు డి.వాసుబాబు, తేజ పాల్గొన్నారు.

రాజుకు నాగబాబు అభినందనలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న జనసేన క్రియాశీలక సభ్యత్వం కార్యక్రమం విజయవంతంగా సాగుతుంది. ఈ మేరకు జనసేన పిఎసి చైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్, ప్రధాన కార్యదర్శి నాగబాబు, ఎమ్మెల్సీ, జనసేన మీడియా ప్రతినిధి హరిప్రసాద్ 175 నియోజకవర్గాల ఇన్‌ఛార్జిలతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో భాగంగా ఇచ్ఛాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు ఆధ్వర్యాన 9,500కు పైగా నమోదు చేపట్టారు. దీంతో దాసరి రాజు పేరు ప్రస్తావిస్తూ... అభినందించారు. ఈ క్రియాశీలక సభ్యత్వం మరో వారం రోజులు పొడిగించారు. ఈ కార్యక్రమాన్ని మరింత ఉత్సాహంగా ముందుకు తీసుకెళ్లాలని క్రియాశీలక వాలంటీర్లకు పిలుపునిచ్చారు.

రమణమూర్తి సేవలు మరువలేనివి

సంతబొమ్మాళి : టిడిపి నాయకులు తంగి రమణమూర్తి సేవలు మరువలేనివని ఎంఇఒలు జె.చిన్నవాడు, అర్జునుడు అన్నారు. మండలంలోని లక్ష్మీపురం ప్రాథమిక పాఠశాలలో గ్రామస్తులు రమణమూర్తి దంపతులకు సోమవారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఇఒలు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి, గ్రామ ఐక్యతకు చేసిన కృషికి అభినందించారు. ఈ పాఠశాలకు అదనపు గది నిర్మాణం, గ్రామాభివృద్ధికి కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రెడ్డి సూరిబాబు, బి.సావిత్రమ్మలు, గేదెల శివారెడ్డి పాల్గొన్నారు.

చెక్కపై చెక్కిన చిత్రపటాన్ని అందజేస్తున్న తెలుగు యువత నాయకులు

రవికుమార్‌కు చిత్రపటం బహూకరణ

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు టిడిపి నాయకులు సోమవారం అరుదైన కేరళ బహుమతిని అందించారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో గెలుపొందిన రవికుమార్‌కు సరుబుజ్జిలి మండలం పెద్ద సవలాపురం, వీరమల్లి పేట, సింధువాడకు చెందిన తెలుగు యువత నాయకులు భాస్కర్ బుజ్జి, పార్వతీశం అభినందనలు తెలుపుతూ ఈ బహుమతిని అందించారు. కేరళ రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన కలప చెక్కపై రవికుమార్ చిత్రాన్ని చెక్కించి ఉన్న ఈ ప్రత్యేక బహుమతి ఎమ్మెల్యేతో పాటు పలువురిని మంత్రముగ్ధులను చేసింది. అరుదైన బహుమతితో సత్కరించిన తెలుగు యువత నాయకులకు రవికుమార్ అభినందించారు. పెద్దసవలాపురం సర్పంచ్ పల్లి సురేష్, మండల తెలుగు యువత నాయకులు తర్లాడ సురేంద్ర పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఎల్‌పిఒ రమణ

పారిశుధ్య మెరుగుకు కృషి

ప్రజాశక్తి- నౌపడ

పారిశుధ్య మెరుగుకు కార్యదర్శులు కృషి చేయాలని టెక్కలి డివిజనల్ పంచాయతీ అధికారి ఐ.వి.రమణ ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో సోమవారం సమావేశం నిర్వహించారు. పారిశుధ్యం నిర్వహణ, ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన, ఇంటి పన్ను వసూలు సమీక్షించారు. సంతబొమ్మాళి, నౌపడ, బోరుభద్ర, హెచ్.ఎన్.పేట పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగుపర్చాలని సూచించారు. కార్యక్రమంలో విస్తరణాధికారి గోపాలరావు, కార్యదర్శులు శ్రీనివాసరావు, మధుకేశ్వరరావు, రాజు, విజయకుమార్, ఎస్.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

అవార్డు అందుకుంటున్న కృష్ణమూర్తిరెడ్డి

కృష్ణమూర్తి రెడ్డికి సేవశ్రీ అవార్డు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం రోటరీ క్లబ్‌లో దక్కత కృష్ణమూర్తిరెడ్డి అందించిన సేవలకు సేవాశ్రీ అవార్డు అందజేశారు. విశాఖపట్నంలో ఆదివారం రాత్రి ఏ వన్ గ్రాండ్ హోటల్‌లో రోటరీ క్లబ్ ఆధ్వర్యాన అవార్డులను అందజేశారు. ఈ మేరకు రోటరీ గవర్నర్ ఎం.వెంకటేశ్వరరావు, రాజు సుబ్రహ్మణ్యంలు కృష్ణమూర్తిరెడ్డికి సేవశ్రీ అవార్డును ప్రదానం చేశారు.

నారాయణమూర్తి గీసిన చిత్రం

నారాయణమూర్తికి పురస్కారం

టెక్కలి : మండలంలోని రావివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయునిగా విధులు నిర్వర్తిస్తున్న మార్పు నారాయణమూర్తికి చిత్రలేఖనం పోటీల్లో రాష్ట్రస్థాయి పురస్కారం లభించింది. ఈ మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.భారతి, ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు. తెలంగాణా రాష్ట్రంలోని హనుమకొండ పట్టణానికి చెందిన సాగంటి ఆర్ట్ అకాడమీ నిర్వహించిన ఆన్‌లైన్ పోటీల్లో పాల్గొని సేవ్ ద గర్ల్ చైల్డ్ అనే ఆంశంపై నిర్వహించిన పోటీల్లో నారాయణమూర్తి గీసిన చిత్రపటానికి మొదటి బహుమతి వచ్చింది.

నగదును అందజేస్తున్న సీతారామశర్మ

విద్యార్థికి నగదు బహుమతి

పలాస : విద్యార్థులు చదువుపై దృష్టిసారించాలని సత్యసాయి ట్రస్టు చైర్మన్ మల్లా రామేశ్వరరావు అన్నారు. మండలంలోని రామకృష్ణాపురం సత్యసాయి విద్యా విహార్‌లో సోమవారం ధర్మపురి సీతారామశర్మ నాన్నమ్మ జ్ఞాపకార్థం బాలమేధా పురస్కారం అనే పేరుతో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన పొట్నూరు సాహిత్ రూ.2,116 నగదును సోమవారం అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రీతీ చౌదరి, తల్లిదండ్రులు అరుణ, శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు తాళాసు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అనుదీప్, మురళి, శ్రీనివాస్, గీతానంద్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కల్వర్టు

మెళియాపుట్టి: మండలంలో పట్టుపురం-మందస రోడ్డులో గోపీనాథపురం సమీపంలో రోడ్డు కల్వర్టు వద్ద వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇక్కడ రోడ్డు కల్వర్టు పాడవడంతో మూడు నెలల కిందట కల్వర్ట్ అభివృద్ధి పనులు చేపట్టారు. అయితే కల్వర్టుకు ఇరువైపులా రోడ్డును కలిపి బెర్మలు సక్రమంగా కలపకపోవడంతో కల్వర్టు వద్ద మట్టి కూరుకుపోయి గోతులు ఏర్పడ్డాయి. దీంతో ద్విచక్ర వాహనదారులు ఇక్కడ అదుపు తప్పి ప్రమాదాలకు గురవు తున్నారు. అలాగే ఇతర వాహనాల రాకపోకలకు ఇక్కడ అసౌకర్యంగా ఏర్పడింది. ఆర్అండ్‌బి అధికారులు స్పందించి కల్వర్టు బిటి రోడ్డు మధ్య అభి వృద్ధి పనులు చేపట్టలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు

విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికితీయాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ నూతన విద్యావిధానంలో విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికి తీయడమే శిక్షా సప్తాహ్ ముఖ్య ఉద్దేశ్యమని ఎమ్మెల్యే గొండు శంకర్ భార్య, టిడిపి తెలుగు మహిళా అధ్యక్షురాలు స్వాతి శంకర్ అన్నారు. మండలం సానివాడ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు తిథి భోజనాలను స్థానిక సర్పంచ్ రుప్ప లక్ష్మీ సోమవారం ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షా సప్తాహ్ కార్యక్రమం ద్వారా ఉపాధ్యాయుల్లో బోధనా నిబద్ధత పెరుగుతుందన్నారు. విద్యా విధానంలో నూతన జాతీయ విద్యా విధానం-2020 గుణాత్మక మార్పులు తీసుకొచ్చిందన్నారు. విద్యా రంగంలో ప్రజలు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం అత్యావశ్యకం అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు భోజనాలను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.లక్ష్మీ, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పట్టణంలోని రెల్లివీధి ప్రాథమిక పాఠశాలలో శిక్షా సప్తాహ్‌లో భాగంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా క్లబ్ వెల్ఫేర్ చైర్మన్ హారికాప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా ప్రోత్సాహక కార్యక్రమాల్లో భాగస్వాములై, ప్రభుత్వ విద్య బలోపేతం చేయడమే లయన్స్ క్లబ్ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వావిలపల్లి జగన్నాథ నాయుడు, విద్యాశాఖ ఎడి శ్రీనివాసరావు, జోన్-3 చైర్‌పర్సన్ కరణం శోభారాణి, కార్యదర్శి మణిశర్మ, ఉపాధ్యక్షులు అప్పలనాయుడు, ఎంఇఒ కృష్ణారావు, హెచ్‌ఎం వేదవతి, శ్రీకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 70 మంది విద్యార్థులకు భోజనాలు అందించారు.

నౌపడ : సంతబొమ్మాళి మండలం దండుగోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం కోత చైతన్య ఆధ్వర్యాన సోమవారం శిక్షా సప్తాహ్ కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు కొన్న మార్కండేయులు ఆర్థిక సహాయం అందించారు. దీంతో ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. నౌపడ జగన్నాథపురంలో ఆర్మీ జవాను షణ్ముఖరావు ఆర్థిక సహాయంతో హెచ్‌ఎం జయకృష్ణారెడ్డి శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద కెసి నాయుడుపేట ఎంపిపిఎస్ పాఠశాలలో ఎంఇఒ చిన్నవాడు భోజనశాలను ప్రారంభించారు. ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ చైర్మన్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : మండలంలోని మేఘవరం పంచాయతీ సూరాడవానిపేట ఎంపిపి స్కూల్‌లో శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. టిడిపి తెలుగు యువత ఉపాధ్యక్షులు సూరాడ రాయుడు, టిడిపి నాయకులు, ఉపాధ్యాయులు రవికుమార్, దర్గారావులు విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

శ్రీకాకుళం అర్బన్ : విద్యార్థులతో క్లబ్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు

వజ్రపుకొత్తూరు : వజ్రపుకొత్తూరులో ప్లస్ టు ప్రిన్సిపాల్ తారకేశ్వర్ పండా, డోకులపాడు ప్రాథమిక పాఠశాలలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు లావణ్య, ఉపాధ్యాయులు విద్యార్థులతో సహపంక్తి భోజనాల్లో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో వజ్రపుకొత్తూరు సర్పంచ్ ప్రతినిధి గురయ్యానాయుడు, సరిత, ఎంపిటిసి భాగ్యలక్ష్మి, చైర్మన్ మోహనరావు, శ్రీనివాసరావు, రమేష్, రంజిత్, తిరుపతి, పుష్ప, హేమ, మమత పాల్గొన్నారు.

కొత్తూరు : దాతలు విరాళాలతో స్థానిక ఎంపిపి స్కూల్-1, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కుంటిభద్ర, పారాపురం పాఠశాలల్లో సహపంక్తి భోజనం నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎంఇఒలు సిహెచ్. గోవిందరావు, ఎన్.శ్రీనివాస్, దాతలు అగతముడి అరుణ్‌కుమార్, ఉన్న కామేశ్వరరావు, హెచ్‌ఎం ధర్మాన కృష్ణవేణి, ప్రసాదరావులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : పట్టణంలోని పంజావీధిలోని మున్సిపల్ ప్రైమరీ పాఠశాలలో విద్యార్థులకు తిథి భోజనం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల కో-ఆప్షన్ సభ్యులు కళ్ల శ్రీనివాసరావు, హెచ్‌ఎం ధనలక్ష్మి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నేత్రాలను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

నేత్ర వైద్య పరీక్షలు

మెళియాపుట్టి : స్థానిక నలంద పబ్లిక్ స్కూల్ ఆవరణలో ప్రిన్సిపాల్ జె.జె.ప్రతాప్ అధ్యక్షతన శ్రీకాకుళం శంకర్ ఫౌండేషన్ నేత్రాస్పత్రి ఆధ్వర్యాన సోమవారం నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. 130 మంది విద్యార్థులకు స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి అలేఖ్య నేత్రాలను పరీక్షించారు. అందులో 52 మందికి రిఫర్ చేశారు. కార్యక్రమంలో ఎంఇఒలు ఎస్.దేవేందర్‌రావు, ఎం.పద్మనాభరావు, ఎస్ఐ టి.రాజేష్, జె.శివప్రసాద్, టి.రామారావు పాల్గొన్నారు.

అవార్డును అందుకుంటున్న ధనావతి

హెల్మెట్ తప్పనిసరి

టెక్కలి రూరల్ : ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని టెక్కలి జూనియర్ సివిల్ జడ్జి తేజచక్రవర్తి మల్ల అన్నారు. మండల కేంద్రంలోని మెళియాపుట్టి రోడ్డు, శేరి వీధి, సోగ్గాడిపేట, గొల్లవీధిల్లో హెల్మెట్ వాడకంపై సోమవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హెల్మెట్ వాడకంపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దివ్వెల వివేకనంద్ పాల్గొన్నారు.

కవిటి : ఎరువులను పంపిణీ చేస్తున్న నాయకులు

ఎరువుల పంపిణీ

సంతబొమ్మాళి: మండలంలోని నర్సాపురం ఎంపిటిసి ప్రతినిధి మోడి రామచంద్రరెడ్డి, తోటాడ సర్పంచ్ ప్రతినిధి యర్నాగుల రామరాజు సోమవారం రైతులకు ఎరువులను పంపిణీ చేశారు. ఎరువులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ ఎం.పావని, చిన్నారావు పాల్గొన్నారు.

కవిటి: మండలంలోని బల్లిపుట్టుగలో రైతులకు రాయితీపై ఎరువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకుడు జగదీష్, బార్ల జనార్ధన, నల్లన చిరంజీవి, నిరకర దళాయి పాల్గొన్నారు.

విత్తన బంతులతో వనాలు

విత్తన బంతులను తయారు చేసిన విద్యార్థులు

ప్రజాశక్తి- పలాస

విత్తన బంతులతోనే వనాలు, వన్య ప్రాణులు సంరక్షణ సాధ్యమని, తద్వారా జీవవైవిద్య వ్యాప్తి జరుగుతుందని పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు ఆస్పన్న ఈశ్వరరావు అన్నారు. మండలంలోని బ్రాహ్మణతర్ల ఉన్నత పాఠశాలలో సోమవారం అంతర్జాతీయ పులులు దినోత్సవం పురస్కరించుకొని ప్రత్యేక లైఫ్ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలలోని జాతీయ హరిత దళం క్లబ్, జూనియర్ రెడ్‌క్రాస్ క్లబ్‌ల ఆధ్వర్యాన విద్యార్థులు బంకమట్టి, సేంద్రీయ ఎరువు, స్థానికంగా దొరికే చింత, మామిడి, ఉసిరి, నేరేడు, పనస, అశోక, దేవకాంచన తదితర విత్తనాలతో ప్రతి విద్యార్థీ పది చెప్పున్న సుమారు ఐదు వేల విత్తన బంతులు తయారు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షం పడే సమయంలో వీటిని రహదారులకు ఇరువైపులా, ఖాళీ ప్రదేశాల్లో, కొండ ప్రాంతంలో వేదజల్లుతారని అన్నారు. అవి మొలకెత్తి, అందులోని ఎరువుని ఉపయోగించుకుని వృక్షాలుగా ఎదుగుతాయన్నారు. ఈ విధంగా చెయ్యడం ద్వారా వన్యప్రాణులు జీవించడానికి అవకాశం కల్పించడం ద్వారా జీవవైవిద్య సంరక్షణతో పాటు అవి జానవాసల్లోకి వచ్చి మనపైన దాడి చేయకుండా నివారించవచ్చు చెప్పారు. కార్యక్రమంలో ఎన్‌జిసి క్లస్టర్ కో-ఆర్డినేటర్ కొయ్యల శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

మాదకద్రవ్యాలపై ప్రభుత్వం ఉక్కు పాదం మోపాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజ్జాడా యుగంధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావులు అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి రైల్వేస్టేషన్ జంక్షన్ వరకు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో జరుగుతున్న మాదక ద్రవ్యాల వ్యాపారాన్ని ప్రభుత్వం అరికట్టాలని డిమాండ్ చేశారు. అనేక మార్గాల, ప్రాంతాల ద్వారా ఆర్‌టిసి బస్సుల్లో, ఆటోల్లో గంజాయి, మత్తు పదార్థాల వంటి ప్రమాదకరమైన వ్యాపారం అనేక చోట్ల జరుగు తున్నప్పటికీ వీటిపై పూర్తిస్థాయిలో ప్రభుత్వ అధికారులు, పోలీసు యంత్రాంగం దృష్టిపెట్టి పటిష్టమైన చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే నిషేధిత గుట్కా, ఖైని, పాన్‌మసాల వ్యాపారం అన్నిచోట్ల యథేచ్ఛంగా అమ్మకాలు జరుగు తున్నా నిషేధించాల్సిన అధికారులు ఏం చేస్తున్నారో తెలియని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. వెంటనే ప్రభుత్వం, అధికారులు వీటిపైన జోక్యం చేసుకొని అమ్మకాలు జరుగుతున్న షాపులను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్ మాటాడుతూ డ్రగ్స్, మత్తు పదార్థాలు అరికట్టడంలో చేస్తున్న ఎఐవైఎఫ్ పోరాటానికి మేము సైతం ముందుండి అక్రమ రవాణాను అరికట్టడానికి చర్యలు తీసుకుంటామని, ఈ మాఫియాపై ప్రజలు, విద్యార్థులు, యువకులు చైతన్యవంతమై సహకరించా లన్నారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ నాయకులు సింహాచలం, కూర్మయ్య, ప్రభుత్వ లెక్చరర్లు, విద్యార్థులు, పోలీసులు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో తెగుళ్ల నియంత్రణ

ప్రజాశక్తి- ఆముదాలవలస

మండలంలో ప్రకృతి వ్యవసాయ విభాగంలో భాగంగా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులతో ప్రధానంగా వరిసాగులో పంటలో తెగుళ్లు, పురుగులు నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకునేలా రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో రాజీ లేని సూత్రాలు పాటిస్తూ పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎల్‌టు డిజిటల్ సురేష్ మాట్లాడుతూ వరిసాగులో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో రాజీలేని సూత్రాలను పాటిస్తే పంటల్లో వివిధ దశల్లో వచ్చే తెగుళ్ల నియంత్రణ సాధ్యమవుతుందన్నారు. వరినాట్లు వేసినప్పటి నుంచి వరినారు శుద్ధి చేసుకోవడం, చిగుళ్ల తుంచి నాట్లు వేయడం వలన పంటలో మొదటి దశలో వచ్చే పురుగులను నియంత్రించవచ్చునని అన్నారు. అలాగే లైన్ షోయింగ్ విధానం చేయడం వలన వరుసల్లో ఖాళీ ఉండటం వలన సూర్య రష్మి పంటకు బాగా తగిలి దుబ్బుశాతం పెరిగి పంట దిగుబడి వస్తుందని తెలిపారు. పొలం గట్లపై కంది, బంతి ఇతర కూరగాయల పంటలు సాగుచేయడంతో రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది నక్క. చిరంజీవి, తిరుపతి, లక్ష్మి, కృష్ణవేణి, జానకి రామ్ పాల్గొన్నారు.

వరుసలో వరి నాట్లు వేస్తున్న రైతులు

టిడ్కో లబ్ధిదారులపై అధిక వడ్డీ భారం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో పాత్రునివలస గ్రామానికి అనుకొని ఉన్న టిడ్కోగృహాలపై బ్యాంకు యాజమాన్యాలు వడ్డీ పేరుతో లబ్ధిదారుల వద్ద సొమ్మును జలగల్లా పిండుతున్నారని యుగంధర్, శ్రీనివాసరావు అన్నారు. సోమవారం జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట టిడ్కో బాధితులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019లో వైసిపి ప్రభుత్వ హయాంలో టిడ్కోఇళ్లను ఇచ్చారని, ఒక్కొక్క ఇంటికి రూ.7,50,000 అనిచెప్పి, వాటికి రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపోను రూ.3 లక్షల 65 వేలు లబ్ధిదారులు చెల్లించటానికి ఒప్పందమైంది. అయితే ఈ అమౌంట్‌కు బ్యాంకు లోన్ ఇవ్వడంతో రెండు ఏళ్లుగా బ్యాంకుకు ఇఎంఐ రూపంలో కడుతున్నప్పటికీ అసలు రికవరీ కాక వడ్డీ పేరుతో లబ్ధిదారులు కడుతున్న అమౌంట్‌ను బ్యాంకు తీసుకోవడం జరిగిందన్నారు. తక్షణమే ప్రభుత్వ అధికారులు జోక్యం చేసుకొని వడ్డీలేని రుణాలు మంజూరు చేసి లబ్ధిదారులు ఆదుకోవాలని కోరారు. అదేవిధంగా కాలనీలో నివసిస్తున్న ప్రజానీకానికి మౌలిక వసతులు, పాఠశాల, అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక చికిత్స కేంద్రం, స్మశాన వాటికను ఏర్పాటు చేసి వారి న్యాయమైన కోర్కెలను తీర్చాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిడ్కో లబ్ధిదారులు శ్రీకాంత్, మీనా, రమాదేవి, సంతోష్ పెద్దఎత్తున లబ్ధిదారులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న టిడ్కో బాధితులు

అశ్లీల వెబ్‌సైట్‌లను నిషేధించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, మద్యం, డ్రగ్స్, అశ్లీల వెబ్‌సైట్‌లను నిషేధించాలని ప్రగతిశీల మహిళా సంఘం (పిఒడబ్ల్యు) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సవలాపురపు కృష్ణవేణి, పోతనపల్లి కుసుమ డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని బలగలో పిఒడబ్ల్యు జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. సెప్టెంబరు 27న చేపట్టనున్న జిల్లా మహాసభలను, అక్టోబరు 27, 28న జరగబోయే రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మహిళల మిస్సింగ్, ఇమ్మోరల్ ట్రాఫికింగ్‌ను అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపట్టాలని కోరారు. సమగ్ర మహిళా, శిశుసంక్షేమానికి తగిన నిధులను కేటాయించాలన్నారు. సమావేశంలో పిఒడబ్ల్యు జిల్లా కోశాధికారి కుత్తుం హేమక్క, కార్యవర్గసభ్యులు కె.జానకమ్మ, చిన్నప్పన్నమ్మ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కుసుమ

పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత

పలాస: పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యతని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు హెచ్.వై.దొర అన్నారు. పలాస ముత్యాలమ్మ కోనేరు వద్ద ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవంలో భాగంగా సోమవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షణ చేసే బాధ్యత తీసుకుంటామన్నారు. మొక్కలను పశువులు పాడు చేయకుండా ట్రీ గార్డ్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సెక్రటరీ తమ్మినాన మాధవరావు, ట్రెజరర్ నెమలిపురి అప్పారావు, వీరఘట్టం వెంకటరావు పాల్గొన్నారు.

మొక్కను నాటుతున్న దొర

ఈ రోడ్లకు మోక్షం కలగదా..?

ప్రజాశక్తి- పోలాకి

ఏళ్లు గడిచిపోతున్నాయి... ప్రభుత్వాలు వస్తున్నాయి... పోతున్నాయి... మండలంలోని కొన్ని గ్రామాలకు వెళ్లే రోడ్ల పరిస్థితి మారడం లేదని వాపోతున్నారు. మండలంలోని మబగాం నుంచి వనిత మండలం, తోటాడ నుంచి గొల్లవలస, నరసాపురం నుంచి ఉరజాం, బార్జిపాడు నుంచి రహిమానుపురం ఇలా అనేక గ్రామాలకు వెళ్లే రోడ్ల పరిస్థితి అధ్వాన్నంగా తయారైంది. మబగాం నుంచి వనితమండలం వరకు మూడు కిలోమీటర్ల పొడవు ఉన్న రోడ్డు 2014 ముందు తారు రోడ్డు ఉండేది. గ్రామస్తులకు ఎటువంటి ఇబ్బందులూ ఉండేవి కాదని, 2014 తరువాత మబగాం ఇసుక ర్యాంపు మంజూరైంది. పేరుకు మబగాం కానీ, వాహనాలు రావడం, పోవడం వనితమండలం రహదారిపైనే. ఇంత ప్రధాన్యత ఉన్న ఈ రోడ్డు ప్రస్తుతం పాడైంది. ఆ తరువాత టిడిపి హయాంలో మెటల్ వేసి కొంత బాగు చేశారు. తరువాత వచ్చిన వైసిపి ప్రభుత్వం హయాంలో రెండు కిలోమీటర్ల పొడవు తారు రోడ్డు వేయడం, కిలో మీటరు పొడవు సిసి రోడ్డు వేయడానికి రూ.36 లక్షలు మంజూరు చేశారు. కానీ, పనులు చేయడంలో నిర్లక్ష్యం చేశారని గ్రామస్తులు వాపోతున్నారు. ప్రస్తుతం రహదారి వెంబడి బేబి షిప్స్ వేసి కనీసం రోలర్‌తో గట్టి చేయకపోవడంతో ద్విచక్ర వాహనామూ నడపలేని పరిస్థితి ఏర్పడింది. రాత్రి సమయంలో బక్ వస్తే ఎక్కడ ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. అలాగే ఈ గ్రామంలో అనేక చేతివృత్తుల గల కుటుంబాలు ఉన్నాయి. వారు బయిట గ్రామాలకు వెళ్లి వ్యాపారం చేసుకుంటేనే వారి కుటుంబ పోషణ జరుగుతుంది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రహదారి పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు. ఈ విషయంపై సర్పంచ్ ఎన్ని వేనమ్మ వద్ద ప్రస్తావించగా... రోడ్డు నిర్మాణానికి ఉన్నతాధికారులతో మాట్లాడి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అధ్వానంగా ఉన్న మబగాం-వనితమండలం రోడ్డు

విద్యార్థుల గోడు వినండి

ప్రజాశక్తి- కవిటి

ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ తదితర కోర్సుల ప్రవేశాల్లో బెంతు ఒరియా విద్యార్థులను ఒసిలుగా భావించి హాస్టల్ వసతి కల్పించడం లేదని బెంతు ఒరియా యువజన సంఘం అధ్యక్షుడు సుమన్ బిసాయి ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యల పరిష్కారానికి బెంతు ఒరియాలు మండల కేంద్రంలో కొనసాగిస్తున్న రిలే నిరాహారదీక్షలు 216వ రోజుకి చేరుకున్నాయి. సోమవారం దీక్షలో పాల్గొన్న బెంతు ఒరియా ప్రతినిధులు తమ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు ఏకరువు పెట్టారు. ముఖ్యంగా చాలామంది బెంతు ఒరియా విద్యార్థులు తమ ప్రతిభతో ఆయా కళాశాలల్లో సీటు సాధిస్తున్నా హాస్టల్ వసతి మాత్రం లభించటం లేదని అన్నారు. దీంతో బయట ఉండి చదువుకునే స్తోమత లేక అనేక మంది విద్యార్థుల భవిష్యత్ డోలాయమానంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో నేటివిటీ ధ్రువపత్రం ఉండేదని, దాంతో ఆయా కోర్సుల్లో ప్రవేశంతో పాటు హాస్టల్ వసతి లభించేదని తెలిపారు. మూడేళ్లుగా నేటివిటీ ధ్రువపత్రం లేకపోవడంతో తమ విద్యార్థుల భవిష్యత్ అంధకారంలో పడిందన్నారు. ప్రభుత్వ పథకాలు కూడా తమకు అందలేదని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తరగతి ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని కోరారు. లేదంటే తమ బిడ్డల జీవితం అంధకారంలో మగ్గిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దీక్షలో పలువురు ఒరియా ప్రతినిధులు పాల్గొన్నారు.